క్లుప్తంగా

28 రైళ్ల రాకపోకలకు అంతరాయం

తిరుపతి అలిపిరి: తుపాను కారణంగా 28 రైళ్ల రాకపోకలను రద్దు చేశామని, రైల్వే ప్రయాణికులు వర్షాలను గుర్తించి సహకరించాలని తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రయాణికులు తిరుపతి, రేణిగుంట రైల్వే స్టేషన్‌లలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నంబర్లు 78159 15571, 94935 48008 లను సంప్రదించాలని కోరారు.

నాణ్యతతో నిర్మించాలి



ల్యాబ్ భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పాకాల: పీహెచ్‌సీ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న ల్యాబ్ భవనాన్ని నాణ్యతతో నిర్మించాలని పంచాయతీరాజ్ డీఈ మాధవరావు సూచించారు. శనివారం నూతనంగా నిర్మిస్తున్న ల్యాబ్ భవనాన్ని ఆయన పరిశీలించారు. రూ.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఈ భవనాన్ని ఎక్కడా నాణ్యతా లోపం రాకుండా చూడాలని హెచ్చరించారు. ఏఈ వరప్రసాద్, నాయకులు నరసారెడ్డి, కరుణాకర్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ

తిరుపతి సిటీ: ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో బీకాం చదువుచున్న కర్నూలుకి చెందిన ఎస్.జితేంద్ర కుమార్ అనే విద్యార్థి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయంపై కళాశాల, టీటీడీ అధికారులు సమగ్ర విచారణ జరిపేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయంపై ఇప్పటికే విచారణ కమిటీలను నియమించినట్లు సమాచారం. కళాశాల విజిలెన్స్ అధికారుల వేధింపులతోనే విద్యార్థి రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకున్నట్లు వదంతులు వినిపిస్తున్న నేపథ్యంలో అన్ని కోణాలలో విచారణ జరిపేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

పుట్ట గొడుగుల పెంపకం కోసం దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో లైవ్లీహుడ్ బిజినెస్ ఇంక్యుబేటర్‌లో పుట్టగొడుగుల పెంపకం ట్రైనింగ్ ప్రోగ్రాంలో చేరుటకు ఆసక్తిగల మహిళా విద్యార్థులను నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోఆర్డినేటర్ ప్రొఫెసర్ జీవనజ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మూడు నెలల ట్రైనింగ్ ప్రోగ్రాం కేవలం ఇంటర్ పాస్ అయిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 98852 44006లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

దేవరకొండపై విశేష పూజలు



విశేషాలంకరణలో శ్రీవేంకటేశ్వర స్వామి

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండపై వెలసిన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. కార్తీక శనివారం ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద ఎత్తున చెక్కభజనలు, పిల్లనగ్రోవులు, తాళాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వామివారి ఊరేగింపు దేవరకొండపై వైభవంగా సాగింది.

ఏర్పేడులో స్తంభించిన ట్రాఫిక్



ఏర్పేడులో ఆగిన వాహనాలు

ఏర్పేడు: మండల కేంద్రంలో భారీ వాహనాల రాకతో శనివారం రాత్రి ట్రాఫిక్ స్తంభించింది. రాత్రి 6.50 గంటలకు వెంకటగిరి రోడ్డు నుంచి ఆరులేన్ల రోడ్డు పనులకు మట్టిని తరలించే లారీలు ఏర్పేడులోని కూడలిలో తిరుపతి వైపునకు రావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం జరిగింది. రాత్రి 6.50 నుంచి 7.40 గంటల వరకు రోడ్డుకు ఇరువైపుల 3 కిలోమీటర్ల దూరం వాహనాలు రోడ్డుపై ఆగిపోయాయి. దీంతో ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వాహనాల పునరుద్ధరించారు. పోలీసుల పర్యవేక్షణ లోపంతో తరచూ ఇలా జరుగుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు.

రెయిన్ కోట్ల పంపిణీ

నాగలాపురం: పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి జెడ్పీటీసీ సభ్యుడు మహేష్‌రెడ్డి శనివారం రెయిన్ కోట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వర్షానికి సిబ్బంది తడుస్తూ ఇబ్బందులు పడుతుండడంతో వీటిని పంపిణీ చేసినట్లు తెలిపారు.

రండి.. కలిసి ఆడుదాం

- క్రీడా సంబరాల్లో యువత భాగస్వామ్యం కావాలి
- డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పిలుపు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డెప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, వైఎస్ఆర్ సీపీ నేతలు

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన క్రీడా సంబరాల్లో యువత భాగస్వాములై క్రీడా స్ఫూర్తిని చాటాలని డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి పిలుపు నిచ్చారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్లతో కలిసి ఆడుదాం... ఆంధ్ర క్రీడా సంబరాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అతి పెద్ద క్రీడా సంబరానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఆడుదాం... ఆంధ్ర పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా 43 రోజుల పాటు నిర్వహించే ఈ మెగా టోర్నీకి ఊరూవాడా ముస్తాబవుతోందని తెలిపారు. ఈ నెల 15 నుంచి 2024 ఫిబ్రవరి 3వ తేదీ వరకు ఈ క్రీడా సంబరాలు కొనసాగుతాయన్నారు. ఆసక్తి ఉన్న 15 ఏళ్లకు పైబడిన క్రీడాకారులంతా ఈనెల 13వ తేదీలోపు సమీపంలోని గ్రామ, వార్డు, సచివాలయంలో, వలంటీర్ల ద్వారా, httpr://aadudamaandhra.ap.gov.in/ వెబ్‌సైట్ ద్వారా లేదా 1902కి ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. తిరుపతి యువత సద్వినియోగం చేసుకొని తమ క్రీడా స్ఫూర్తిని చాటాలని కోరారు. కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, నరేంద్రనాథ్, డాక్టర్ ఆరణి సంధ్య, వైఎస్ఆర్ సీపీ నేతలు దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, జిల్లా క్రీడల అధికారి సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ఉపశమనానికి పాలియేటివ్ నర్సింగ్ కీలకం



మాట్లాడుతున్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్

తిరుపతి తుడా: క్యాన్సర్ తారస్థాయికి చేరుకున్న రోగికి ఉపశమనం కలిగించడంలో పాలియేటివ్ నర్సింగ్ పాత్ర కీలకమని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు. శనివారం పద్మావతి ఆడిటోరియంలో స్విమ్స్ ఫిజియోథెరపీ, నర్సింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిరంతర వైద్య విద్యా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. క్యాన్సర్ రోగికి నొప్పులు తగ్గించడంతో పాటు వారి జీవన ప్రమాణ స్థాయిని పెంచేందుకు పాలియేటివ్ నర్సింగ్ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నై సత్యభామ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌కు చెందిన డాక్టర్ ఎల్ లక్ష్మీ, స్విమ్స్ వైద్యులు డాక్టర్ శివకుమార్, డాక్టర్ నాగరాజు, ఫిజియోథెరపీ ప్రిన్సిపల్ డాక్టర్ మాధవి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధారాణి, డాక్టర్ శ్రీకుమారి, డాక్టర్ విశ్వనాథరెడ్డి, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత వినికిడి పరీక్షలు

తిరుపతి కల్చరల్: ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా కొంకా వీధిలోని తిరుపతి స్పీచ్ అండ్ హియరింగ్ కేర్ సెంటర్‌లో ఆది, సోమ, మంగళవారం మూడు రోజులపాటు ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆ సెంటర్ అధినేత పి.గోపినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చిన్న పిల్లల నుంచి వయో వృద్ధుల వరకు అన్ని వయస్సుల వారికి వినికిడి సమస్య, మాటలు రాని పిల్లలకు తగిన పరీక్షలు, కౌన్సిలింగ్ వంటి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే అవసరమైన వారికి ఉచితంగా హియరింగ్ ఎయిడ్ ట్రైల్స్, పాత హియరింగ్ ఎయిడ్స్‌పై ఎక్స్‌చేంజ్ ఆఫర్ వంటి సౌకర్యం, బ్లూటూత్, రీచార్జబుల్ హియరింగ్ అమర్చుకొనే ఏడాది అదనపు ఉచిత బ్యాటరీలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలు, సందేహాలకు 98490 85342 నెంబరులో సంప్రదించాలని తెలియజేశారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 159 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

తిరుపతి సిటీ: న్యూ బాలాజీ కాలనీలోని ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 159మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డీవీఎస్ చక్రవర్తి రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రతి విద్యార్థి ఉన్నత ఉద్యోగాలు సాధిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 319 మంది విద్యార్థులు ఎంఎన్‌సీ కంపెనీల్లో మంచి వేతనాలతో, ప్యాకేజీలతో ఉద్యోగాలు సాధించారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రిన్సిపల్ ఉషా, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మాధవ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

5,6 తేదీల్లో శ్రీకాళహస్తి ఏడు గంగమ్మల జాతర

శ్రీకాళహస్తి: పట్టణంలో ఈనెల 5,6 తేదీల్లో ఏడుగంగమ్మల జాతరను సమష్టి కృషితో విజయవంతం చేద్దామని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని ముత్యాలమ్మ ఆలయ కల్యాణ మండపంలో శనివారం ఏడుగంగల జాతర నిర్వహణపై గంగమ్మ కమిటీలు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీలు ఏడుగంగమ్మల జాతర నిర్వహణలో నిమగ్నమై ఉన్నాయని, కమిటీకి గుర్తింపు ఇస్తూ వారి ద్వారానే సారె అందజేసే విధంగా చూస్తామన్నారు. అదే విధంగా శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున సారెను సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. సీఐ అంజూయాదవ్ మాట్లాడుతూ అందరి సహకారంతో ట్రాఫిక్ నియంత్రణ చేస్తామని, భారీ బందోబస్తు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కమిషనర్ రమేష్ బాబు మాట్లాడుతూ పట్టణ వీధులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో స్వర్ణమూర్తి, అంజూరు బాలసుబ్రహ్మణ్యం, సెన్నీరు కుప్పం శేఖర్, మొగరాల గణేష్, హరినాథ్, సురేష్ గురుకుల్, రవి, శంకర్, కిషోర్, గురుమూర్తి, విజయ కుమార్, బాల, బాలగౌడ్, యువకిషోర్, రవికిరణ్, ప్రభాకర్, రవి, హరి, లక్ష్మీపతి, శేఖర్ పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల వ్యతిరేక విధానంపై పోరాటాలు

తిరుపతి కల్చరల్: వీధి వ్యాపారుల వ్యతిరేక విధానాలపై ఏఐటీయూసీ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాక్రిష్ణ తెలిపారు. బైరాగిపట్టెడ ఆర్చి వద్ద వీధి వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఏఐటీయూసీ తిరుపతి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత శ్రీకాళహస్తిలో ఈనెల 17, 18, 19వ తేదీల్లో నిర్వహించే ఏఐటీయూసీ తిరుపతి జిల్లా ప్రథమ మహాసభలకు వీధి వ్యాపారులంతా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వీధి వ్యాపారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సర్దార్ శివకుమార్, సీపీఐ నగర నేత విశ్వనాథ్, ఏఐటీయూసీ నేత ఎన్‌డీ రవి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నేత శ్రీరాములు, మహిళా సంఘం నేత నదియా, ఏఐవైఎఫ్ రామకృష్ణ, శ్రీనివాసులు, సుధాకర్, బాషా, కాంచనమ్మ, లక్ష్మి, ఆటో యూనియన్ నేతలు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీకపిలేశ్వరస్వామి రుద్రయాగం



శ్రీకపిలేశ్వరాలయంలో స్వామివారి రుద్రయాగం

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం రుద్రయాగం వేడుకగా నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆలయంలో నెల రోజులపాటు విశేష పూజలు, హోమ మహోత్సవాలు చేపడుతున్నారు. ఈ నెల రోజుల విశేష పూజలు, హోమ మహోత్సవాలలో భాగంగా స్వామివారి రుద్రయాగం ప్రారంభమైంది. ఈ రుద్రయాగం 11వ తేదీ నుంచి 11 రోజులపాటు నిర్వహించనున్నారు. ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా డిజిటల్ లిటరసీడే

శ్రీకాళహస్తి: ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శనివారం ప్రపంచ డిజిటల్ లిటరసీ డే(ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం)ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో అవసరమన్నారు. సాంకేతికత అనేది మన జీవితంలో ఎలా భాగస్వామి అయ్యింది, దానివల్ల ఉపయోగాలు.. దేశ అభివృద్ధిపై ప్రభావం తదితరాలను వివరించారు. అదే విధంగా స్మార్ట్‌ఫోన్లు, గూగుల్ వ్యవస్థ, మైక్రోసాఫ్ట్ వంటివి ఎలా అభివృద్ధి చెందాయో తెలియజేశారు. మనిషి దైనందిన జీవితంలో ఇవి ఎంత సాయపడుతున్నాయో వివరించారు. వైస్ ప్రిన్సిపల్ మురళి పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటరు జాబితా



నరసింగాపురం బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ శిరీష

చంద్రగిరి: తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేయడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ శిరీష బూత్ లెవెల్ అధికారులను ఆదేశించారు. జాతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం మండల వ్యాప్తంగా ×డోర్ టు డోర్ ఓటరు జాబితా పరిశీలన్ల నిర్వహించారు. ఈ నేపథ్యంలో మండల పరిధిలోని నరసింగాపురం జెడ్పీ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏదైనా చిరునామాలో అనర్హుల పేర్లను చేర్చినట్లయితే, ఫారం-7 తీసుకొని సంబంధిత యజమాని నుండి వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీఎల్‌ఓ విజయ్, మహిళా పోలీసు కె.లైలా తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక ఓటరు శిబిరాల పరిశీలన



ప్రత్యేక ఓటరు శిబిరాలను పరిశీలిస్తున్న కమిషనర్ హరిత, అధికారులు

తిరుపతి తుడా: నగరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు శిబిరాలను తిరుపతి నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి హరిత శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. కొత్త ఓటరు నమోదుకు మరోసారి అవకాశం కల్పిస్తూ, ప్రస్తుత ఓటరు జాబితాలో అభ్యంతరాలు స్వీకరించి, తుది ఓటరు జాబితా నమోదుకు సరైన పద్ధతులు పాటించేలా జాగ్రత్తగా ఉండాలన్నారు. నగరంలో శనివారం, సత్యనారాయణపురంలోని ఎలిమెంటరీ స్కూల్, జడ్పీ హైస్కూల్లోనూ, అదేవిధంగా సుబ్బారెడ్డి నగర్‌లోని సరస్వతి శిశుమందిర్ పాఠశాల, మరికొన్ని శిబిరాలను ఆమె పరిశీలించారు. ఆమె వెంట తిరుపతి అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ, సిబ్బంది ఉన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలి



ప్లాస్టిక్ వస్తువులను తొలగిస్తున్న విద్యార్థులు

తిరుపతి సిటీ: ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలని మహిళా వర్సిటీ డిప్యూటీ వార్డెన్ ప్రొఫెసర్ బి రమ్యా కుబేర్ పిలుపునిచ్చారు. శనివారం ప్రపంచ పొల్యూషన్ ప్రివెన్షన్ డే సందర్భంగా మహిళా వర్సిటీ శబరి హాస్టల్ వద్ద విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో మానవ మనుగడకు ముప్పు ఉందన్నారు. పెద్ద సంఖ్యలో మొక్కలను పెంచాలన్నారు. దీంతో ఎకోఫ్రెండ్లీ వాతావరణంతో స్వచ్ఛమైన గాలి అందుతుందన్నారు. అనంతరం హాస్టల్ రూమ్స్‌తో పాటు చుట్టు పక్కన వాడిపడేసిన ప్లాస్టిక్‌తో కూడిన కవర్, బాటిల్స్ ఇతర వస్తువులను తొలగించారు. అసోసియేట్ పి.లక్ష్మి, విద్యార్థులు, హాస్టల్ కార్మికులు పాల్గున్నారు.

మృతులకు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి నివాళి



రాజేంద్రకు నివాళులర్పిస్తున్న హర్షిత్‌రెడ్డి

పాకాల: మండలంలో మృతి చెందిన ఇద్దరి ఆత్మకు శాంతి చేకూరాలని చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి నివాళులర్పించారు. ఇరంగారిపల్లి పంచాయతీ తలారిపల్లి గ్రామానికి చెందిన గుణశేఖర్, చంద్రశేఖర్‌ల తండ్రి రాజేంద్ర(66) ఆకస్మికంగా మృతి చెందారు. అలాగే మద్దినాయనపల్లి గ్రామానికి చెందిన మల్లికార్జున(మల్లి)(37) శుక్రవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందాడు. శనివారం హర్షిత్‌రెడ్డి మృతుల నివాసాలకు చేరుకుని, మృతదేహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎంపీపీ లోకనాథం, డివిజన్ అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, కపిలేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ గిరిరెడ్డి, రాయలసీమ మోహన్, శివాజి, దేవ, నాగూర్, నరేష్, దాము, సిద్దయ్య, చిట్టిబాబు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: తుపాను నేపథ్యంలో మూడు రోజులపాటు మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం ఆమె అన్ని విభాగాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్ 0877-2256766 ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. తిరుపతి అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, ఆర్వో కేఎల్ వర్మ, సేతుమాధవ్, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులురెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, డీఈలు, మేనేజర్ చిట్టిబాబు, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అభయ ఆంజనేయస్వామి విగ్రహం బహూకరణ



అభయ ఆంజనేయస్వామి విగ్రహం

తిరుపతి కల్చరల్: శ్రీకాళహస్తి మండలం ఆంజనేయపురం వద్దనున్న పురాతనమైన ఆంజనేయ స్వామి ఆలయానికి రూ.90 వేలు విలువ చేసే ఐదున్నర అడుగుల అభయ ఆంజనేయస్వామి విగ్రహాన్ని దాత జక్కిరెడ్డి శ్రీనివాసులురెడ్డి బహూకరించారు. ఇటీవల లారీ దూసుకుని రావడంతో రోడ్డు పక్కనున్న ఆంజనేయస్వామి ఆలయం, ఆంజనేయస్వామి విగ్రహం ధ్వంసమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహం ప్రతిష్ట కోసం ఆంజనేయపురం ప్రజలు కర్నూలుకు చెందిన జక్కిరెడ్డి శ్రీనివాసులురెడ్డిని కోరారు. వారి విజ్ఞప్తి మేరకు ఆయన స్వామివారి విగ్రహాన్ని తన సొంత ఖర్చుతో తమిళనాడులో ప్రత్యేకంగా రూపొందించిన అభయ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్టాపనకు అందజేశారు.

ఉత్సాహంగా రాస్ క్రీడా పోటీలు



జెండా ఊపి క్రీడలను ప్రారంభిస్తున్న ఎస్వీయూ ఆర్ట్స్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ పద్మనాభం

తిరుపతి కల్చరల్: రాస్ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఎస్వీయూ క్రీడామైదానంలో శనివారం రాస్ సిబ్బందికి చేపట్టిన క్రీడా పోటీలు ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్వీ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పద్మనాభం హాజరయ్యారు. రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం మాట్లాడుతూ పొదుపు సంఘాల ద్వారా ఆర్థిక క్రమశిక్షణను సభ్యులకు అలవర్చడంలో గొప్ప కృషి చేస్తున్న రాస్ సేవా కార్యకర్తలకు ప్రతి ఏటా ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రాస్ సిబ్బందికి కబడ్డీ, డ్యాన్స్‌బాల్, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. రాస్ జాయింట్ సెక్రటరీ మమత, ఎస్వీయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్యాంమోహన్, రాస్ డైరెక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

ఉపాధిలో గ్రామాభివృద్ధి పనులు

ఏర్పేడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గ్రామాలకు ఉపయోగపడే పనులను చేపట్టాలని ప్రాజెక్ట్ మేనేజర్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ చెరువు కట్టల బలోపేతం, రైతులకు ఉపయోగ పడే పంట, వరవ కాల్వలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతుల పొలాల్లో మామిడి, పూల తోటల పెంపకం తదితర పనులను చేయాలన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ దేవరి, జేఈ బాలాజీరావు, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

పాంచరాత్ర ఆగమంలో మోక్షధర్మం



మాట్లాడుతున్న కాండూరు శ్రీనివాసాచార్యులు

తిరుచానూరు(చంద్రగిరి): పాంచరాత్ర ఆగమంలో సూచించిన ధర్మ మార్గం మోక్షాన్ని ప్రసాదిస్తుందని టీటీడీ పాంచరాత్ర ఆగమ సలహాదారు కాండూరు శ్రీనివాసాచార్యులు తెలియజేశారు. టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు, భగవత్‌శాస్త్ర పాంచరాత్ర ఆగమ సంరక్షణ సభ సంయుక్త ఆధ్వర్యంలో తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం వద్దగల ఆస్థానమండపంలో అఖిల భారత భగవత్‌శాస్త్ర పాంచరాత్ర ఆగమ విద్వత్ సమ్మేళనం శనివారం రెండో రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ పాంచరాత్ర ఆగమం 108 సంహితల్లో నిక్షిప్తమై ఉందని, ఇందులో నాట్యం, వైద్యం, సంగీతం, జ్యోతిష్యం, శిల్ప శాస్త్రాలు ఇమిడి ఉన్నాయని తెలిపారు. అనంతరం తిరుచానూరుకు చెందిన ప్రతాప్‌స్వామి, ఆర్య స్వామి, తిరుపతికి చెందిన లక్ష్మీ నరసింహన్ స్వామి, మైసూరుకు చెందిన గోపాలన్‌స్వామి తదితరులు పాంచరాత్ర ఆగమంలోని వివిధ అంశాలపై ప్రసంగించారు. టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రాం అధికారి రాజగోపాల్ రావు, దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు, సమన్వయకర్త పరకాలన్ స్వామి, శ్రీరంగం పాంచరాత్ర ఆగమ సంరక్షణ సభ నిర్వాహకులు రామభట్టర్, కార్యదర్శి జయపాల్, ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ పురుషోత్తం పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాకు నమోదు చేసుకోండి

ఏర్పేడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఆడుదాం ఆంధ్రాకు యువత పేర్లను నమోదు చేసుకోవాలని సర్పంచ్ మోహనప్రియ అన్నారు. శనివారం మండలంలోని ఎండీపుత్తూరు సచివాలయంలో ఆడుదాం ఆంధ్రాపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ గ్రామీణ యువతలో ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ఈపోటీలను నిర్వహిస్తోందని వివరించారు. ఆసక్తి ఉన్న యువకులు సచివాలయంలో పేర్లు నమోదు చేసుకుని క్రీడల్లో పాల్గొనాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి లోకముని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.